క్లుప్తంగా

10న చామర్రులో చతుర్థి మహోత్సవాలు

అచ్చంపేట: మండలంలోని చామర్రులో కృష్ణా నది ఒడ్డున వేంచేసియున్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఈ నెల 10న అష్టోత్తర శత సంకటహర చతుర్థి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రభాత సేవతో పూజలు ప్రారంభవుతాయన్నారు. అశేషంగా భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

నేడు వాహనాల వేలం

అచ్చంపేట: వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ కె.పాల్ రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 16 వాహనాలున్నాయని, వాటిలో పల్సర్, గ్లామర్, యాక్సెస్, డిస్కవర్, ప్లాటినా, టీవీఎస్ స్టార్‌సిటీ, యాక్టివా తదితర బైక్‌లు ఉన్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వారు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను ముందుగా పరిశీలించుకోవచ్చని తెలిపారు. డిపాజిట్ రూ.2వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వెంటనే లేదా రెండు రోజులలో పూర్తి సొమ్ము చెల్లించి, సొంత ఖర్చులపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, బకాయి పన్నులు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. వేలం పూర్తయిన వెంటనే డిపాజిట్ సొమ్మును వాపసు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

శ్రీనివాసరావు మృతి తీరని లోటు



అచ్చంపేట: మండలంలోని కోనూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు పసుపులేటి శ్రీనివాసరావు(51) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హుటా హుటిన కోనూరు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో ముఖ్యనాయకుడైన శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలకపాత్ర వహించారని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆయన వెంట ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణా నాయక్, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంపా జ్వాలా నరసింహారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విజిలెన్స్ అధికారులు తనిఖీలు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లిలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది వివరాలు, వారి విధులు గురించి వివరాలు సేకరించారు. ఆసుపత్రిలో రోజువారి నమోదవుతున్న కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, బాలింతలకు, గర్భిణులు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. లేబర్‌రూమ్, వార్డులను తనిఖీ చేసి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో జనరేటర్ నిర్వహణ, ఆక్సిజన్ ప్లాంటు, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకట్రావు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను వివరించారు. విజిలెన్స్ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎస్‌ఐ రామచంద్రారెడ్డి, ఎఫ్‌ఆర్‌ఓ సైదులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): దోమల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సత్తెనపల్లి మలేరియా సబ్‌యూనిట్ అధికారి సీ.హెచ్.ప్రభాకరరెడ్డి అన్నారు. పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలోని 25వ వార్డు శివాలయం బజారు నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రత, నీటినిల్వలు లేకుండా చూసుకోవాలంటూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వడ్డవల్లి వైద్యాధికారి భూషన్‌రావు మాట్లాడుతూ చిన్నచిన్న జాగ్రత్తలతో దోమకాటు ను నివారించుకోవచ్చన్నారు. ప్రతి వారం ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్లసాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.ఆదంషఫీ, మలేరియా హెల్త్ అసిస్టెంట్స్ ఎంపీకిరణ్‌బాబు, ఎస్.ఎమ్.హుస్సేన్, షరీఫ్, సచివాలయ హెల్త్ సెక్రటరీ శాంతకుమారి, దీనమ్మ, ఆశ కార్యకర్త శివపార్వతి పాల్గొన్నారు.

ఇచ్చిన మాట మేరకు పింఛన్ పెంపు

మంత్రి అంబటి రాంబాబు



లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): నిరుపేదల్లో ఆత్మస్థైర్యం నింపుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సాయాన్ని పెంచి అందించడంతో పేదల గుండెల్లో ముందుగానే సంక్రాంతి వచ్చినట్లుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటిరాంబాబు చెప్పారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద కొత్త పింఛన్ పంపిణీ వారోత్సవాల్లో భాగంగా రూరల్ మండల పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ పింఛన్ సాయంతో వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు వారి కుటుంబాల్లో గౌరవం పెరిగిందన్నారు. ఎన్నికల సమయానికి ఇచ్చిన మాట ప్రకారం మూడు వేలు అందిస్తామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు సంక్షేమాన్ని అందిస్తూ ప్రజాపరిపాలన చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటుగా అగ్రవర్ణ పేదలకు ఆర్థికంగా నిలబెట్టడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి నేరుగా సంక్షేమ సాయం అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని చెప్పారు. రాబోయే ఎన్నికల్లోను మనమంతా అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తం 350 మందికి కొత్త పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్‌యలవర్తిపాటి జైబూన్‌బి, రాష్ట్ర రైతుసలహా మండలి సభ్యులు కోళ్ళం విజయభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయపాటిపు రుషోత్తమరావు, తహసీల్దార్ నగేష్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ

ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 7వ తేదీన కొత్తగా మంజూరైన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధిపై బహిరంగంగా చర్చిద్దాం

టీడీపీ నేతలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సవాల్



బెల్లంకొండలో సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మహిళలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

బెల్లంకొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై... టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై ప్రజల మధ్యనే చర్చించుకుందామని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. బెల్లంకొండ మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే శంకరరావు టీడీపీ నాయకులు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. గత పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గంలో చేయలేని అభివృద్ధిని, తాను ఎమ్మెల్యేగా మూడున్నరేళ్ల కాలంలో పదింతలు చేసి చూపించానన్నారు. రోడ్లకు తట్టెడు మట్టి కూడా వేయలేని వారు తనపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలోని గ్రామాలకు వస్తే తమ ప్రభుత్వంలో తాను చేసిన అభివృద్ధి కనిపిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ తన సొంత గ్రామంలో కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. గత ఎమ్మెల్యే దత్తత తీసుకున్న గ్రామానికి రోడ్డు వేయలేకపోతే తాను వేయిస్తున్నానన్నారు. తనపై విమర్శలు చేస్తున్నవారు క్షేత్రస్థాయిలో తనతో వస్తే తాము చేసిన అభివృద్ధిని దగ్గరుండీ చూపిస్తానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.25 కోట్లతో ఆస్పత్రుల నిర్మాణం చేపట్టామన్నారు. అమరావతి–తుళ్లూరు రోడ్డు నిర్మాణం, పెదమద్దూరు వద్ద హైలెవల్ వంతెన, అమరావతి– బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించామని, త్వరలో పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు దోచుకుని, తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. అనంతరం 134 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొని, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్సు సాంబశివరావు, చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, భద్రయ్య, అన్నపురెడ్డి నర్సిరెడ్డి, వైస్ ఎంపీపీలు అహ్మద్ పాషా, మరియదాసు, దరియా, సిరిపురం మేస్త్రీ, బడాబచ్చా, మౌలాలి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో వివక్ష చూపలేదు

అమరావతి: కుల, మత, పార్టీ, వర్గాల వివక్షకు తావులేకుండా అర్హులందరికి సంక్షేమఫలాలు అందచేస్తున్నామని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం అమరావతి 1వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురావటంతో అయన వెంటనే తన వెంట ఉన్న అధికారులను సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. స్థానిక సాలీపేట, గాజులపాలెం, మ్యూజియంరోడ్డు, వివేకానంద నగర్‌లో గడప గడపకు తిరుగుతూ కాలనీ వాసుల సమస్యలను ఎంతో ఓపికతో విని వెంటనే అధికారులతో చర్చించి వెంటనే పరిష్కారాలను సూచిస్తూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఆర్థికంగా ఇబ్బందులున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా వేల కోట్ల రూపాయలతో అదుకున్న జగనన్నను మరోసారి దీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కోట హరిబాబు, జడ్పీటీసీ ఈద్పుగంటి కరుణకుమారి, జడ్పీ కో–ఆప్షన్ మెంబర్ షేక్ హుమీ, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, గ్రామసర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్ బాబు, ఎంపీటీసీ గుడిశె అనూషా, పార్టీ నాయకులు నంబూరు బాబురావు, మంగిశెట్టికోటేశ్వరరావు, అలాలక్ష్మీనారాయణ, నందూరిక రుణకుమార్,విన్నకోట సాంబశివరావు,శివరామకృష్ణ, పి.రో శిబాబు, అళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం పథకాల అమలులో రాజీలేదు

పెదకూరపాడు: ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా.. రాజీ పడకుండా అర్హులైన వారందరికీ రూ.2,750లకు పింఛన్ పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిదేనని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పేదలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం ఆపలేదన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయన్నారు. 2019 ఎన్నికలకు ముందు పెదకూరపాడు నియోజకవర్గంలో 29,910 పింఛన్లు ఇచ్చారని నేడు జగనన్న పాలనలో 38,344 పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. జనవరిలో పెదకూరపాడు నియోజకవర్గంలో 1,150 మందికి నూతనంగా పింఛన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు కంకణాల శివాజీ, బాజీ, నల్లపాటి యోహాన్, తహసీల్దార్ క్షమారాణి, ఎంపీడీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

ఏపి గురుకుల కార్యదర్శి పావనమూర్తి



గురుకుల విద్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి పావనమూర్తి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఈ విద్యాసంవత్సరానికి విద్యాలయం భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి మార్చి నాటికి ప్రారంభించాలని ఏ.పీ.గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.పావనమూర్తి చెప్పారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సమీపంలో సుమారు రూ.21 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఏపీ బాలుర గురుకుల విద్యాలయం భవన నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకున్నాయని, అయితే చేపట్టిన పనుల్లో ఫ్లోరింగ్ పనులు మరలా చేపట్టాలని సూచించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన మార్పులు, చేర్పులను సూచించారు. వచ్చే విద్యాసంవత్సరానికి అన్ని వసతులతో తరగతి గదులు సిద్ధం చేయాలన్నారు. ఆయనతో పాటుగా డిప్యూటీ కార్యదర్శి జి.యోగేశ్వరరావు, ఏఎమ్‌ఓ ఎన్.సంజీవరావు, డీసీఓ శాంతివిశాల, ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఈ.ఈ శ్రీనివాసరెడ్డి, అచ్చంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఓ.జాన్సన్ తదితరులు ఉన్నారు.

యాజమాన్యపద్ధతులపై అవగాహన



నకరికల్లు: వరిలో కాంప్లెక్స్ ఎరువులను దుబ్బు చేసే సమయంలో గాని అంకురం ఏర్పడే దశలో గాని వేయకూడదని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో వ్యవసాయసలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాస్వరం ఎరువుతో జింక్‌సల్ఫేట్ ఎరువును కలిపి వేయకూడదని సూచించారు. నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా విభజించి నాటుకు ముందు దమ్ములో, దుబ్బుదశలో, అంకురం దశలో వేయాలన్నారు. 36నుంచి 48 గంటల తరువాత పలుచగా నీరుపెట్టాలన్నారు.ఎంపీటీసి సభ్యుడు రేమిడిచర్ల ఖాశిం, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పాశం వెంకటరెడ్డి, వ్యవసాయ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో వెంకటేశ్వరస్వామి



లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో శ్రీవారు



పట్టణంలోని ఆశ్రమంలోని స్వామివారు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకారంలో శుక్రవారం స్వామి వారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా స్వామి వారిని మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

వైభవంగా ఆరుద్రోత్సవం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శ్రీసనారీవీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో ఆరుద్రోత్సవంలో భాగంగా శివముక్కోటి శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని మల్లిఖార్జున లింగానికి ద్వాదశ జ్యోతిర్లింగాలకు, పాదరసలింగాలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. బిల్వార్చన, మంత్రపుష్పం, మహానివేదన పూజలు నిర్వహించారు.

ఖేలో ఇండియా ఫిట్ ఇండియాపై అవగాహన

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఖేలో ఇండియా ఫిట్ ఇండియా కార్యక్రమం పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తెనపల్లి సబ్ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అన్ని పాఠశాలల్లోను ఖేలో ఇండియా రిజిస్ట్రేషన్స్ త్వరగా పూర్తి చేయాలన్నారు. అందుకు గాను విద్యార్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ లాకుపిచ్చయ్య, స్కూల్‌గేమ్స్ సహాయకార్యదర్శి ఏ.శ్రీరామిరెడ్డి, పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు విజయకమల, డివిజన్‌లోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



నామినికి నగదు అందజేస్తున్న గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు

నకరికల్లు: పేదలకు అండగా వైఎస్సార్ బీమా పథకం మనో ధైర్యాన్నిస్తోందని గ్రామ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కండ్లకుంట గ్రామానికి చెందిన చేకూరి బుల్లి లింగయ్య మృతిచెందగా మృతుని మట్టిఖర్చుల నిమిత్తం నామినీకి రూ.10,000లను వైఎస్సార్ బీమా పథకం ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు కంఠమనేని కోటయ్య మాట్లాడుతూ కుటుంబ పెద్ద కోల్పోయిన నిరుపేదలకు వైఎస్సార్ బీమా పథకం ఆర్థిక భరోసానిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు



ముగ్గులపోటీలను తిలకిస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నాయకులు

రాజుపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగవుతున్న ముగ్గుల పోటీలను భావితరాల వారు తెలుసుకునేందుకే ఈ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని గణపవరం, అంచులవారిపాలెం, అనుపాలెం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు గణపవరం, అంచులవారిపాలెంలో మహిళలు వేసిన ముగ్గుల పోటీలను పరిశీలించారు. గణపవరంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు బీమా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ముగ్గులు వేసిన ప్రతి మహిళకు స్టీలు క్యారేజీని అందజేశారు. గణపవరంలో 90 మంది మహిళలు అంచులవారి పాలెంలో 317 మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మహిళా సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్‌గీతా హాసంతి, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పంచ్‌లు వెంకటరమణ బుల్లిబాబు, సానికొమ్ము వెంకటసుబ్బమ్మ శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు, ఓర్సు వెంకటపతి, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

నకరికల్లు: ముగ్గుల పోటీలు మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీస్తాయని మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలకు మహిళల నుంచి గొప్ప ఆదరణ లభిస్తోందన్నారు. గ్రామస్థాయిలో ఎంపికైన వారికి మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో దూదేకుల బాష, షేక్.సలీల్, పరసా సాంబ, రుసుం శ్రీనివాసరావు, మొగిలి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలకు ప్రతీక ముగ్గుల పోటీలు

ముప్పాళ్ళ: తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి ముగ్గులు అని, వాటిని ప్రోత్సహించేందుకే ఏటా పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సత్తెనపల్లి పట్టణంలోని 13,14,25,26 వార్డుల్లో జరుగుతున్న వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలను శుక్రవారం పరిశీలించారు. ముగ్గుల పోటీలతో గ్రామాల్లో ముందుగానే సంక్రాంతి పండుగ వాతావరణం కనిపిస్తుందన్నారు. పోటీలల్లో విజేతలకే కాకుండా పోటీదారులందరికీ బహుమతులు అందిస్తామన్నారు. గ్రామస్థాయి, మండలస్థాయి లలో విజేతలైన వారికి నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పట్టణంలోని 4, 15,16,17,18,30,31 వార్డుల్లో ముగ్గుల పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లోని విజేతలకు బహుమతులను వార్డు కౌన్సిలర్లు అందించారు. ఆయా పోటీలను ఉమెన్స్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ డైరెక్టర్ డా.గీతాహాసంతి, మున్సిపల్ చైర్మన్ చల్లంచర్లలక్ష్మీ తులసి, వైస్‌చైర్మన్‌లు కోటేశ్వరరావునాయక్, నాగూర్‌మీరాన్, కౌన్సిలర్లు అచ్యుతశివప్రసాదు, బండిరాజ్యలక్ష్మీ, గడ్డంవెంకటేశ్వర్లు, గంటారమణమ్మ, సెగ్గెంపద్మావతి, తోటవెంకటసుధారాణి, శిరిగిరిసీతామహాలక్ష్మీ లు పర్యవేక్షించారు.

300 మంది రోగులకు వైద్య పరీక్షలు



వైద్యశిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్రోసూరు: క్రోసూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కాటూరి మెడికల్ కాలేజ్ వైద్యులు పాల్గొని, 300 మంది రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. మందులు, గుండెకు సంబంధించిన ఎకో, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. వైద్య శిబిరాన్ని సిమ్స్ పాఠశాల డైరెక్టర్ మక్కెన గోవర్ధనరావు, పద్మావతి దంపతులు ప్రారంభించారు. ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న సభ్యులందరికీ వారు అభినందనలు తెలియజేశారు. ఏటా ట్రస్ట్‌కు రూ.40 వేలు విరాళం అందిస్తున్న డైరెక్టర్ మక్కెన దంపతులను సభ్యులు ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షేక్ షరీఫ్, ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ ఖాశింబుడే, కంభంపాటి రాము, మల్లాల రామాంజనేయులు, షేక్ బాషా, షేక్ అల్లాబక్షు, కొంకా నరేంద్ర, స్వామి పాల్గొన్నారు.

ఓర్వకల్లు తిరునాళ్ల రాబడి రూ.2.70 లక్షలు



ఓర్వకల్లు గంగాదేవీ అమ్మవారు

క్రోసూరు: అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ అమ్మవారి దేవస్థానం తిరునాళ్ల సందర్భంగా వివిధ వ్యాపారాలకు నిర్వహించిన వేలం పాటల ద్వారా దేవదాయశాఖకు రూ.2,70,500ల రాబడి వచ్చినట్లు ఈవో జి.రామకోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి 6వ తేదీ వరకు, అదేవిధంగా మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే నెల తిరునాళ్ల మహోత్సవాలకు క్రోసూరులోని వీరభద్ర మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కు రూ.1,63,500కు పాడుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా కొబ్బరి చిప్పలు సేకరణ రూ.35,000, లడ్డూ ప్రసాదాల విక్రయం రూ.72,000కు పాడుకున్నట్లు తెలిపారు. సత్తెనపల్లి డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి వేలం పాటలను పర్యవేక్షించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాదేవీ అమ్మవారి దేవస్థానం చైర్మన్ పూల పెదహనుమయ్య, వైస్ చైర్మన్ జి.కోటిరెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వమే క్రైస్తవ తత్వం

- గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య
- భక్తిశ్రద్ధలతో ముగ్గురు రాజుల వార్షికోత్సవం



దివ్యపూజబలి నిర్వహిస్తున్న రెవరెండ్ భాగ్యయ్య

పెదకూరపాడు: మానవత్వమే....క్రైస్తవ తత్వమని గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. ఆధ్యాత్మిక గ్రామమైన పాటిబండ్లలో శుక్రవారం ముగ్గురు రాజుల వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో క్రైస్తవ విశ్వాసులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యపూజ బలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు సందేశం ఇచ్చారు. ముగ్గురు రాజుల (జ్ఞానులు) వల్లే బాలయేసును కనుగొని తమ జీవితాల్లో ఆధ్మాత్మిక జ్యోతిని వెలిగించుకోవాలని కోరారు. ప్రేమ, కరుణ, దయ, మానవత్వం కలిగి ఉండటమే క్రైసత్వ తత్వమని పేర్కొన్నారు. పాపుల రక్షణ కోసం ఏసుక్రీస్తు పశువుల పాకలో జన్మించారని తెలిపారు. తోటి వారి యెడల ప్రేమ, ఆదరణ కలిగి ఉండాలన్నారు.100 ఏళ్ల చరిత్ర కలిగిన ముగ్గురు రాజుల దేవాలయాన్ని సందర్శించేందుకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పాటిబండ్ల తిరునాళ్ల మహోత్సవం తిలకించేందుకు చుట్టపక్కల నుంచి భారీ ప్రజలు తరలివచ్చారు. రంగురాట్నం, అగళ్లు, కోలాటం. భజన కార్యక్రమాలు అలరించాయి. స్థానిక విచారణ గురువులు హృదయకుమార్, సహాయక గురువులు నందిగం సురేష్‌లు, స్థానిక పెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.